వనితాలోకం:

చిన్ని పరీక్ష

సావిత్రికి రెండో పెళ్లి సంబంధమే కుదిరింది. రెండోపెళ్ళివాడయినా వరుడు, కామేశ్వరరావు, మరీ పెద్దవాడేమీ కాదు. అతని వయస్సు ఇరవైఎనిమిదే వుంటాయి. మొదటి భార్య పోయి ఆరు నెలలయింది. ఆమె సంతానం ఒక్క ఐదేళ్ల కుర్రవాడు మాత్ర మున్నాడు. కామేశ్వర రావు అందగాడుకూడా. ఒక విదేశీ కంపెనీ బ్రాంచిలో హెడ్ అక్కౌంటంటుగా పని చేస్తున్నాడు. సావిత్రి సంతోషంతోనే ఒప్పుకుంది సంబంధానికి. కట్నం భార మూ లేదు కాబట్టి సావిత్రి తల్లిదండ్రులకు కూడా ఎంతో సంతోషంగా ఉంది.

కామేశ్వరరావు తన పెళ్లికి తన కొడు కును కూడా తీసుకురాకూడదు కాబట్టి రాంపండును తీసుకురాలేదు. సావిత్రి ఆడ బిడ్డలూ వాళ్లూమాత్రం చెప్పారు రాంపండు చాలా ముద్దుగా ఉంటాడనీ, వాడిని చూసిన వారు విడిచిపెట్టలేరనీని. సావిత్రి ఎప్పుడు రాంపండును చూద్దామా, ఎప్పుడు వాడి చేత 'అమ్మా' అనిపించుకుందామా అని ఉవ్విళ్లూరసాగింది. అత్తవారింట మను గుడుపులకు వెళ్లినప్పుడు రాంపండును చూడవచ్చుననుకుంది. కాని అక్కడ రాంపండు ఆమె కంటబడలేదు.

చివరిరోజున సావిత్రి ఆడబిడ్డలతో కూర్చుని పచ్చీసు ఆడుకొంటూంటే రాంపండు చిన్ని జేబులో బొంగరమూ, ఎడమచంకలో కుక్కపిల్లబొమ్మా పెట్టు కొని, కుడిచేతితో బెల్టులోనుంచి జారిపో తున్న లాగు పైకి దోపుకుంటూ ఆ గదివైపుకే వచ్చాడు. సావిత్రి పెద్ద ఆడబిడ్డ "వీడే నమ్మా, నీ కొడుకు" అని రాంపండును చూపించింది. సావిత్రి వాడికేసి చూసింది.

చిన్ని మొగంమీదకు పడుతున్న ఆ దుబ్బు జుట్టూ, ఆ గుండ్రని పెద్దకళ్లూ, చిదిమితే పాలుకారుతాయన్నట్టున్న బుగ్గలూ, చిన్ని పెదవులూ చూస్తూంటే దగ్గరకు తీసుకొని ముద్దాడుదామని లేచింది. సావిత్రి పెద్ద ఆడబిడ్డ "రా, రాంపండూ, ఇదుగో మీ అమ్మ" అంది. రాంపండు గడపదగ్గర ఆగి పోయి తల ప్రక్కకువంచి సావిత్రికేసి తదేక దృష్టితో చూడసాగాడు. ఆ చూపుకు సావిత్రి ఆశ్చర్యపోయింది. అయినా ఎత్తు కుందామని ముందు కడుగువేయబోతూంటే రాంపండు నిర్లక్ష్యంగా మొగం త్రిప్పి వేసుకొని వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు. సావిత్రి అలాగే నిలబడిపోయింది. ఆడబిడ్డలు నవ్వారు. "చూశావా వదినా, నిన్ను ఎలా చూశాడో రాంపండు! ఎవరీమె, మన

వాసమూర్తి

ఇంటికి వెంటనే వచ్చారంది, నాన్న ప్రక్కన ఎందుకు కూర్చుంటోంది అని పరీక్ష చేస్తున్నాడు. సంజాయిషీ చెప్పుకోవాలమ్మాయి" అంది చిన్న ఆడబిడ్డ. సావిత్రికి సిగ్గూ, నవ్వూ రెండూ వచ్చాయి. "రాంపండుకు కొత్త ఎక్కువేమిటి?" అని అడిగింది మెల్లగా. "చిన్న పిల్లలందరికీ మొదట్లో అలాగే ఉంటుందిలేవమ్మా, ఒక్క రెండు రోజులు చనువిచ్చావంటే ఆపైన నెత్తికెక్కి కూర్చుంటాడు" అని చెప్పింది పెద్ద ఆడ బిడ్డ. సావిత్రి తిరిగివచ్చి ఆట సాగించింది.

పుట్టింటికి తిరిగివెళ్లేలోగా ఒక్కసారైనా రాంపండును గట్టిగా ముద్దాడాలని సావిత్రి ఉబలాటపడసాగింది. సాయంత్రం రాంపండు మళ్లీ ఆ గదివైపుకే వచ్చాడు. ముందు లోపలికి తొంగిచూసి ఎవరూ లేరు కదా అనే ధైర్యంతో గదిలోనుంచి పోసాగాడు. సావిత్రి చాటునుంచి చూసి వెన కాలే రాంపండుదగ్గరకు పరుగెత్తింది. పారిపోబోయాడు కాని సావిత్రి వాడిని పట్టివేసుకొని, ఎత్తుకొని, ముద్దుపెట్టుకుంది– అంతే 'అమ్మా' అంటూ బాధతో విడిచి పెట్టివేసింది. 'ఎంత గట్టిగా కరిచివేశాడు! పళ్లు నొక్కులుకూడా పడ్డాయి' అనుకుంటూ చేతితో రుద్దుకుంది. రాంపండు గుమ్మం వైపుకు నాలుగడుగులు పరుగెత్తి ఆగి, బుజం మీదనుంచి 'బాగా అయిందా' అన్నట్లు చూసి పరుగెత్తుకుపోయాడు. ఇదేమిటి, కుర్రవాడు చూస్తే ఇంత ముద్దుగాఉన్నాడు, కాని ఇంత పెంకెగా ఉన్నాడే



చిన్నపరీక్ష

అనుకుంది. ఆమెకు భయంవేసింది ఎవరేనా గిట్టనివాళ్లు తనపట్ల రాంపండు మనసు విరిచారేమోననీ, తాను కొట్టాననీ తిట్టాననీ చెప్పి భయం కలిగించారేమోననీని. సవతి తల్లి అంటేనే లోకందృష్టిలో బిడ్డల నేడ్పించుకు తినేదనే. ఇలా తలచుకునే సరికి సావిత్రి హృదయంలో అభిమానమూ, పట్టుదలా పెరిగాయి. రాంపండు తనవాడు. తనకూ వాడికీ మధ్య రావడానికి ఇతరుల కేమధికారముంది? తాను అందరు సవతి తల్లులవంటిదానను కానని ఋజువు పరచుకోవాలని నిశ్చయం చేసుకుందామె. తన భర్త ప్రేమలో ఆమె కెటువంటి సందేహమూ లేదు. అటువంటి భర్త తనకు లభించినందుకు తన అదృష్టాన్ని తానే పొగడుకుంది. రాంపండు చిన్న హృదయం కూడా తనదిగా చేసుకుంటే తనకు కావలసినది మరేముంటుంది?

మనుగుడుపుల తర్వాత సావిత్రి పుట్టింటికి వచ్చిందని మాటేకాని ఆమెమనస్సు తాను చేయబోయే కాపురాన్ని గురించి ఆలోచనలతోనే నిండిపోయింది. రాంపండు దుబ్బు జుట్టూ, కళ్ళూ, బుగ్గలూ అన్నీ అస్తమానూ ఆమె కళ్లముందాడసాగాయి. ఎప్పుడు తన సొంతకాపురం చేస్తానా, ఎప్పుడు రాంపండును తనివితీర ముద్దాడుతానా అనే ఉత్కంఠ సిగ్గువల్ల బయటికి వెలువరించలేక హృదయంలోనే అణచిపెట్టుకుంది సావిత్రి. ఒక నెలతర్వాత ఒక రోజున కామేశ్వరరావు భార్యను తీసుకువెళ్లడానికి వచ్చాడు. తల్లీ తండ్రీ తగు విధంగా సారెలతో చీరెలతో కూతురిని కొత్తకాపురానికి పంపించారు.

సావిత్రికి అత్తగారి బాధలంటూ లేవు. ఎందుకంటే అత్తగారూ వాళ్ళూ మరొక ఊళ్ళో ఉన్నారు. ఇక్కడ తాను సంపూర్ణ స్వేచ్ఛ ననుభవించవచ్చు. కామేశ్వరరావు తీసుకున్నది ఒక శుభ్రమైన వీథిలో ఒక చక్కని చిన్న డాబా. తిరిగి వచ్చినతర్వాత కూడా కామేశ్వరరావు మరి రెండురోజులు సెలవు పెట్టి సావిత్రిని బజారుకూ అక్కడకూ తీసుకువెళ్లి ఆమెకు కావలసిన చీరలూ వగైరాలూ, ఇంట్లోకి కావలసిన వస్తువులూ అన్నీ కొనితెచ్చాడు. ఇల్లంతా ఆమె అభిరుచికి అనుగుణంగా అలంకరించాడు. ఇంట్లో పనుల్లోకూడా సావిత్రి వద్దంటున్నా సాయపడ్తున్నాడు. భర్త అలా తనప్రక్కన పనిచేయడం ఆమెకు సిగ్గుగా ఉన్నా లోలోపల పొంగుతున్న ఆనందంవల్ల గట్టిగా కాదనలేకపోతోంది. కామేశ్వరరావు రెండురోజులూ తనతోబాటు సినిమాలకు తీసుకువెళ్లాడు. కాని సావిత్రికి మొదట్లోనే ఒక పెద్దలోటు కనిపించింది. రాంపండు అక్కడ లేని లోటు. వచ్చీరావడంతోనే భర్త నడిగింది రాంపండు ఏడని.

"అమ్మమ్మగారింట్లో ఉన్నాడ"న్నాడు కామేశ్వరరావు.

"ఇక్కడ సొంత ఇల్లుండగా అక్కడ ఉండడమేమిటి?" అని అడిగింది సావిత్రి.

"వాడికిక్కడ కొత్తగా ఉండవచ్చు. అక్కడే ఉంటే బాగుంటుంది" అన్నాడతను ఆమెకేసి పరీక్షగా చూస్తూ.

"ఊఁహుఁ. రాంపండు ఇక్కడే ఉండాలి. నేనుండగా మరొకరిని పెంచనీయను?"

తన కొడుకుపట్ల సావిత్రి కున్న అభిమానం చూసి కామేశ్వరరావు హృదయం సంతోషంతో నిండిపోయింది. అతని కదవరకున్న కొన్ని అనుమానాలు కూడా తొలగిపోయాయి. "వాడి అమ్మమ్మగారు కొద్దిరోజులుంచుకు పంపిస్తామంటేనే పంపాను. నీవు రాకముందే వాడిని పంపించివేయవలసినదిగా వాళ్లకు ఉత్తరం రాశాను. నీవు ఏమంటావో చూదామని ఇంతవరకూ చెప్పలేదు" అన్నాడతను చిరునవ్వుతో.

మర్నాటి మధ్యాహ్నం కామేశ్వరరావు మొదటి అత్తవారి ఊరునుంచి ఒక బంధువు రాంపండును తీసుకువచ్చి దిగబెట్టి వెంటనే తిరిగి వెళ్లిపోయాడు. సావిత్రి రాంపండును ముద్దుగా దగ్గరకు పిలిచింది. కాని వాడు మూతి ముడుచుకొని, మిడిగుడ్లు చేసుకొని, బెదరింపుగా వేలాడించాడు. వాడి బెదరింపు చూస్తే సావిత్రికి నవ్వు వచ్చింది. కాని అప్పుడే ముద్దుపెట్టుకుంటే మళ్లీ కరుస్తాడేమో నని భయంవల్ల మెల్లగానే చనువు చేసుకోవాలనుకొని అప్పటికి వాడిదగ్గరకు పోలేదు. రాంపండు కాసేపు ఇంట్లో తన సామానన్నీ చూసుకొని, తర్వాత తన బొమ్మకుక్కపిల్లా, బొంగరమూ తీసుకొని వీధిలోకి పరుగెత్తి తన పాతస్నేహితులని కలుసుకొని ఆటల్లో మునిగిపోయాడు.

సాయంత్రం తండ్రి రావడం చూసి రాంపండు ఇంటికి పరుగెత్తుకు వచ్చాడు. కామేశ్వరరావు కొడుకును చూసి ఎత్తుకొని, ముద్దాడి లోపలకు తీసుకువెళ్లాడు. సావిత్రి వైపుకు మల్లెపూల పొట్లం విసిరి "ఇదుగో నీ గారాబుకొడుకు, సావిత్రీ. వీడికి ముందు అన్నం పెట్టు. నాకింకా ఆలస్యముంది. అట్టే ఆలస్యమయితే వీడు నిద్రపోతాడు. తరువాత మన మిద్దరం తినవచ్చులే" అన్నాడు. సావిత్రి అలాగేనని వంట తరువాయి చూడసాగింది. కామేశ్వరరావు కొడుకును దొడ్లోకి తీసుకుపోయి కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడిగి "ఇప్పుడమ్మదగ్గరకు వెళ్లి, అన్నం తిని పడుకో, నాన్నా" అని పంపి తానుకూడా కాళ్లూ చేతులూ, మొగం కడుగుకొని, దుస్తులు మార్చుకొని తనపని చూసుకోసాగాడు.

రాంపండు మెల్లగా వంటింట్లోకి నడిచాడు. సావిత్రి పీట వేసి కంచం పెట్టింది. వాడు పీటమీద కూర్చున్నాడు. సావిత్రి అన్నం వడ్డించి "నేను కలిపి పెట్టనా, రాంపండూ" అంది. రాంపండు మళ్ళీ మిడిగుడ్లు చేసుకొని "నువ్వు పో" అన్నాడు అధారిటీ చేస్తున్నట్లుగా బయటికి చేయి చూపిస్తూ. అయినా సావిత్రి దగ్గర కూర్చొని అన్నం కలపబోయింది. వాడు లేచి పోబోయాడు. "పోనీ, నువ్వే తినులే" అంటూ సావిత్రి పులుసుగిన్నే, నేతిగిన్నే కూడా వాడిదగ్గరే పెట్టి అవతలకు పోయి గుమ్మంలో నిల్చొని చూడసాగింది. కాని రాంపండు అన్నం కలుపుకోలేదు. సావిత్రికేసే చూస్తూ కూర్చున్నాడు. తా నెగురుగా ఉంటే తినడేమోనని తలుపులు జేరవేసి తలుపుసందులో నుంచి చూడసాగింది సావిత్రి. ఇప్పుడామె చూడడం లేదుకదా అనుకొని రాంపండు భోజనానికి ఉపక్రమించాడు. మొదట్లోనే పులుసు పోసేసుకున్నాడు. నేతిగిన్నెలో నెయ్యంతా వంచేసుకున్నాడు. బాగా కలపకుండానే ముత్తం బొక్కివేయసాగాడు. సగం తిని, మిగతాది ప్రక్కకు తోసివేసి, మిగిలిన అన్నంలో కూర కలుపుకున్నాడు. అది కూడా బాగా కలుపుకోలేక అలాగే తినసాగాడు. వాడి తిండివరస చూస్తే సావిత్రికి నవ్వూ వస్తోంది, ముద్దూ వస్తోంది. ఇప్పటినుంచీ వీడికింత స్వతంత్రబుద్ధేమూ అని. ఆ చిన్ని చేతులతో పూర్తిగా కలవని అన్నం తినడానికి తీసుకుంటూంటే సగం క్రిందే పడిపోతోంది. మిగిలినదైనా పూర్తిగా నోట్లోకి పోవడంలేదు. మూతితో బాటు ముక్కు కూడా భోంచేస్తున్నట్లుంది.

రవి గ్లిసరిన్ సోప్

రవి గ్లిసరిన్ సోప్ అన్ని కాలములలో వాడదగినది. శరీరమును మృదువుగాను, కాంతిగను ఉంచును. సోల్ ఏజంట్లు :- ది న్యూ స్టార్ & కో., మద్రాసు 21.

చొక్కా నిండా, పీటమీదా, కంచం చుట్టూ మెతుకులే! అలాగే ఆ కూర అన్నం కొంత తిని, తల ఎత్తి చూసి, "పెరుగు!" అని గట్టిగా అరిచాడు రాంపండు. చిన్ని రాజుగారి ఆజ్ఞ వెంటనే శిరసావహించక పోతే ప్రమాదమని సావిత్రి త్వరగా పెరుగు గిన్నె తీసుకువెళ్ళి వాడి కంచంలో పోయ సాగింది. ఎంతకీ వాడు చాలనడం లేదు. సావిత్రే వాడికి తగినంత పోసి గిన్నె ప్రక్కను పెట్టి వచ్చింది. రాంపండు పెరుగు అన్నం జుర్రడం హడావుడిలో ఉన్నాడు కాబట్టి సావిత్రి అక్కడే నిలబడి ఉండడానికి ఈసారి అభ్యంతర పెట్టలేదు. సావిత్రి మెల్లగా అంది: "ఏం, నాన్నా. నేనంటే నీకెందుకింత కోపం. నేను నిన్నెప్పుడైనా కొట్టానా, తిట్టానా. నేనెవరో నీకు తెలియదూ?" రాంపండు పెరుగుఅన్నం చేతితో తీస్తూ "నువ్వెవలూ" అని ప్రశ్నించాడు పెద్ద జడ్జీగారిలా ముఖంపెట్టి. "నేను మీ అమ్మనే, రాంపండూ" అంది సావిత్రి ఆనందంతో గొంతుక పూసుకుపోతూండగా. రాంపండు నోటిదాకా తెచ్చుకున్న చెయి కంచానపెట్టికొట్టి "నువ్వు మాఅమ్మవు కావు, దొం[illegible]వు" అనేశాడు. సావిత్రి కొయ్యబారిపోయింది. అప్పుడే అటు వస్తున్న కామేశ్వరరావు కూడా ఆమాటలు విని ఒక క్షణం నిల్చొనిపోయాడు. ఒక్కసారిగా ఒళ్లు మండుకువచ్చిందతనికి. లోపల కురికి "ఏరా వెధవా, ఎవరు నేర్పార్రా నీకీ మాటలు? మళ్లీ అను చంపేస్తా"నంటూ వాడిని దబదబా వాయించసాగాడు. సావిత్రి కంగారుగా అడ్డుపడి రాంపండును చేతుల్లోకి తీసుకొంది. అయినా రాంపండుకు రెండు దెబ్బలు తగలనే తగిలాయి. వాడు పెద్దపెట్టున ఏడవసాగాడు. ఆ ఏడుపు చూసి కామేశ్వరరావు కోపం హరించుకుపోయి "ఈసారెప్పుడూ అలాంటి మాట లనకేం అమ్మని. అమ్మ ఎలా చెపితే అలా చేస్తూండు, తెలిసిందా. జాగ్రత్త" అని బెదరించి వెళ్లిపోయాడు. సావిత్రి రాంపండు నోదార్చి, వాడి ఏడుపు కాస్త తగ్గిన తర్వాత మళ్ళీ పీటదగ్గర కూర్చోబెట్టి మిగిలిన అన్నం పెట్టబోయింది. కాని వాడు చేయి తోసివేశాడు. ఇక లాభం లేదని, వాడి ఒళ్ళు దులిపి, చెయ్యీ మూతీ కడిగి, తీసుకువెళ్లి మంచంమీద పడుకోబెట్టి, జోకొట్టి వచ్చింది. సావిత్రికి పెద్ద భయం పట్టుకుంది భర్త తనపక్షాన మాట్లాడి రాంపండును కొట్టడంవల్ల వాడికి తనమీద కోపం పెరిగి తనకు దూరమవుతాడేమోనని. అందుకే భర్త భోజనం చేస్తూండగా అంది: "ఎందుకండీ, రాంపండును అలా కొట్టారు?" అని. "అదికాదు సావిత్రీ, ఇలాంటి మాటలంటూంటే ఊరుకోకూడదు. ఎవరో నేర్పినట్టున్నారు ఈ మాటలు" అన్నాడు కామేశ్వరరావు ఆమాట తలచుకొని మళ్లీ కోపం వస్తూ. "అదంతా నేను చూసుకుంటానుగా. వాడిని నాకు పూర్తిగా విడిచిపెట్టండి. ఇక ముందు మీ రెన్నడూ రాంపండుమీద చేయి చేసుకోనని మాట యివ్వండి" అంది సావిత్రి భర్తకేసి స్నిగ్ధంగా చూస్తూ. కామేశ్వరరావు ఒక నిమిషం సావిత్రికేసి చూశాడు. చిరునవ్వుతో అన్నాడు. "నేను మాత్రం వాడిని కొట్టగలనా? వాడి నోటంట అలాంటి మాట వచ్చిందని కొట్టానుకాని. వాడు నీవాడేలే. నీ యిష్టంవచ్చినట్లు చూసుకో."

మర్నాడు ప్రొద్దున్న రాంపండు లేచేసరికి కామేశ్వరరావు అడిగాడు: "ఏరా

దీక్ష —ఎస్. వి. జోగారావు, కాకినాడ.

★ చిన్ని పరీక్ష ★

నాన్నా, ఈవేళ బడికి వెళ్తానా?" "ఎళ్తాను నాన్నా" అన్నాడు రాంపండు ఉత్సాహంతో రాత్రి దెబ్బ లప్పుడే మరచిపోయి.

"అయితే దొడ్లోకి పోయి మొగం కడుగుకొనీ, అమ్మచేత నీళ్లు పోయించుకునీ, అన్నంతిని వెళ్లు" అన్నాడు తండ్రి.

రాంపండు బుర్రఊపి దొడ్లోకి పోయాడు.

సావిత్రి వేడినీళ్లు కాచి రాంపండుకు పోద్దామని, బిందెలో తోడుకొని తీసుకుపోబోతూంటే దొడ్లోనుంచి ఏడుపు వినిపించింది. సావిత్రి కంగారుగా బిందెతో పరుగెత్తింది. రాంపండు తనకుతానే నూతిదగ్గర చన్నీళ్లు పోసేసుకుంటున్నాడు. మొగమంతా సబ్బు రుద్దుకున్నాడు. నురగ కంట్లోకి పోయి కళ్లుమండి ఏడుస్తున్నాడు. "ఇదేంపని, రాంపండూ, నేను వస్తున్నానుగా" అని సావిత్రి దగ్గరకు పోయి మొగం కడగబోయింది. రాంపండు చేతితో ఆమెను తోసివేశాడు. "అయితే మీ నాన్నను పిలవనా" అంది సావిత్రి. వాడు మళ్లీ మాట్లాడలేదు. సావిత్రి వేడినీళ్లతో మొగంమీద నురుగు కడిగివేసి, శుభ్రంగా నీళ్లుపోసి, బట్టలు తొడిగి, వద్దిఅన్నం పెట్టింది. వాడు తన పలకా, బలపమూ తీసుకొని తండ్రి దగ్గరకు పోయి "బడి కెల్తున్నాను, నాన్నా" అన్నాడు. "వెళ్లిరా, నాన్నా" అంటూ కామేశ్వరరావు వాడిచేతిలో ఒక కానీ పెట్టాడు. వాడు హుషారుగా గంతులు వేసుకుంటూ పరుగెత్తుకు పోయాడు.

సావిత్రి ఆఫీసువేళకు భర్తకు భోజనం పెట్టి, తను భోజనంచేసి, రాంపండు బడినుంచి వచ్చినతర్వాత అన్నం పెట్టామని వంటింట్లో పీట, కంచం పెట్టివచ్చింది. పదకొండయినా రాంపండు రాలేదు. బడి విడిచి చాలాసేపయి ఉంటుంది, ఇంతవరకూ రాలేదేమా అని ఆదుర్దా పడసాగింది. పన్నెండయింది. రాంపండు రాలేదు. "ఎక్కడికైనా పారిపోలేదుకదా. ఎటైనా పోతే వాడికి దారేమి తెలుస్తుంది? ఏ బండి క్రిందకో పరుగెత్తితే –" సావిత్రి గుండె దడదడ కొట్టుకోసాగింది. పోనీ ఇరుగు పొరుగుల నెవరినైనా అడుగుదామంటే సిగ్గువల్ల ● మెకింకా వాళ్లతో బాగా పరిచయమేర్పడలేదు. మరి కొంతసేపటికి ఇక ఉండలేక సావిత్రి ఎలాగో ధైర్యం తెచ్చుకొని ప్రక్క యింటావిడ నడిగింది రాంపండు వాళ్లింటికి వచ్చాడేమో నని. రాలేదని చెప్పిందావిడ. "కంగా రెందుకమ్మా. కడుపులో కాలితే వాడే వస్తాడులే" అంది ఆవిడ. సావిత్రి ఇంటికి తిరిగి వచ్చింది. మరొక అరగంట చూసినా వాడు రాకపోగా మళ్లీ ప్రక్కయింటావిడ దగ్గరకు పరుగెత్తింది. వాళ్ల పిల్లల నెవరినైనా పంపి రాంపండును వెదకి తెప్పించమని బ్రతిమాలింది. మీకు పుణ్యముంటుందండి. "ఎందుకమ్మా, అంత కంగారుపడతావు. మా పిల్లాడు ఇంట్లోలేడు. వాడు వచ్చినతర్వాత పంపుతానులే" అంది ఆవిడ. సావిత్రికి ఇంట్లో ముళ్లమీద కూర్చున్నట్లుంది. మళ్ళీ పరుగెత్తింది ప్రక్కయింటావిడ దగ్గరకి. ఆవిడ తన కొడుకును రాంపండును వెతుక్కు రమ్మని పంపింది. ఆ కుర్రవాడు తిరిగి తిరిగి వచ్చాడు. రాంపండు ఇంకొకరి యింట్లో వాళ్ళ కుర్రవాడితో బాటు అన్నం తిని, అక్కడినుంచే బడికి వెళ్ళిపోయాడనీ, ఇప్పుడు బడిలో ఉన్నాడనీ అతను చెప్పాడు. సావిత్రికి ఏమీ తోచలేదు. ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెకు చాలా నిరాశ కలిగింది. రాంపండును తన వాడిగా చేసుకోవడం…తా నోడిపోతానేమో నని పించసాగింది. ఎన్నివిధాల ప్రయత్నించినా రాంపండు చనువు కావడంలేదు. మరెలా వాడిని చనువు చేసుకోవడం? ఈ ఆలోచనలో పడి సాయంత్రంవరకు గడిపింది.

సాయంత్రం ఇంటికి రాకపోతే తండ్రి కోపపడతాడేమో నన్న భయంతో రాంపండు బడినుంచి తిన్నగా యింటికి వచ్చాడు. "మధ్యాహ్నం ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగింది సావిత్రి. రాంపండు వేలు కొరుక్కుంటూ ఏమీ జవాబీయలేదు. "ఇంకెప్పుడూ అలా వెళ్లకేం. మీ నాన్నకు తెలిస్తే కొడతారు. ఇంకెప్పుడూ వెళ్లవుకదూ" అంది సావిత్రి. వాడు భయంగా చూస్తూ తలఊపాడు. సావిత్రి భర్తతో మధ్యాహ్నం రాంపండు ఇంటికి రాకుండా, ఇంకొకరి యింట్లో అన్నం తిన్న సంగతి చెప్పలేదు – చెపితే భర్త రాంపండు నేమిచేస్తాడో అని భయమూ, తన అసమర్థతకూడా బయటపడుతుందనే సంకోచమూ రెండూ పీడించడం వల్ల.

మర్నాడు మధ్యాహ్నం రాంపండు బడినుంచి తిన్నగా యింటికే వచ్చాడు అన్నం తిన్నాడు. సావిత్రి వంటింటికి గొళ్లెంపెట్టి వీధిగదిలోకి వచ్చి లేసు అల్లుకుంటూ కూర్చుంది. రాంపండు ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ, కుక్కపిల్లతోనూ, బొంగరంతోనూ ఆడుకుంటున్నాడు. కొంతసేపటికి వంటింటి గొళ్లెం చప్పుడయింది. సావిత్రి ఉలిక్కిపడి లేచి చూసింది. రాంపండు ఒక కుర్చీ తలుపుదగ్గరకు లాగుకొని దానిమీద నిలబడి కర్రతో గొళ్లెం పడగొట్టుతున్నాడు. మధ్య వెనక్కి తిరిగి చూశాడు. సవతితల్లి కనిపించేసరికి కర్ర ప్రక్కన పడవేసి కుర్చీమీదనుంచి దూకివేశాడు. ఆ దూకడంలో కుర్చీతోబాటు ముందుకు పడ్డాడు. సావిత్రి "అయ్యో" అంటూ లేవదీయడానికి ముందు కురికింది. కాని రాంపండు త్వరగాలేచి సావిత్రిని తప్పించుకొని పరుగెత్తుకుపోయాడు. "ఏమీ చేయను, రాంపండూ, నీ కేం కావాలో చెప్పు, నేనుపెడ్తాను" అంటున్నా వాడు పరుగెత్తుకుపోయాడు. సావిత్రికి కొంచెం విసుగూ కోపంకూడా కలిగింది "ఏమిటీ పిల్లవాడు! ఎంత ప్రేమగా చూస్తూంటే అంత దూరంగా ఉంటున్నాడు!" కొంత బెదరింపుకూడా చూపాలేమో ననుకుంది. కన్నతల్లి మాత్రం కొడుకు నెప్పుడూ కొట్టకుండా తిట్టకుండా ఉంటుందా? తానస్తమానూ అమిత ప్రేమ ఒలకబోయడానికి ప్రయత్నించడమే పొరబాటేమో ననుకుంది. రాంపండు చాలాసేపటివరకూ ఇంటికి రాలేదు. బడివేళయ్యేసరికి బెదురుగా చూస్తూ లోపలికి వచ్చి పలకా, బలపమూ తీసుకొని పరుగెత్తుకు పోయాడు.

సాయంత్రం మామూలుగానే తిరిగి వచ్చాడు. సావిత్రి వంటింట్లో పనిచేసుకుంటోంది. వాడు వీధిగదిలో తండ్రి కూర్చునే డ్రాయరుముందు కుర్చీలో కూర్చొని కాసేపు తండ్రిలా ఉండాలనే కోర్కె తీర్చుకోసాగాడు. పుస్తకాలన్నీ తీసి తెలిసినవాడులా కాగితాలు తిరగవేయసాగాడు. కాసేపటికి విసుగు పుట్టింది కాబోలు, బల్లమీద నున్న చక్కని 'పేపర్ వెయిట్' చూసి అది జేబులో పెట్టుకున్నాడు. అదే సమయానికి సావిత్రి వంటపని పూర్తిచేసుకొని అటు వచ్చింది. ఆమెను చూసి వాడు పారిపోబోయాడు. భర్త దేదో వస్తువు వాడిజేబులో ఉండడం చూసి వాడిని "ఆగు, ఆగు, రాంపండూ" అని పిలిచింది. వాడు పరుగెత్తుతూనే ఉన్నాడు. ఆ వస్తువు క్రిందపడి పగిలిపోతుందేమోనని సావిత్రి వాడి వెనకాల పరుగెత్తింది. రాంపండు ఇక తను పారిపోలేనని తెలుసుకొని, గిర్రున వెనక్కి తిరిగి, చేతిలో బొంగరం సావిత్రిమీదకు గట్టిగా విసిరేశాడు. అది వెళ్లి సావిత్రి నుదుటికి కుడివైపున తగిలింది. సావిత్రి ఆగిపోయింది. బొంగరం ములికి గుచ్చుకొని రక్తం కారసాగింది.

అప్పుడే కామేశ్వరరావు అటువచ్చి ఈ సంఘటన చూసి, కొడుకును రెక్కపుచ్చుకొని లోపలకు లాగుకువెళ్లి వీపుమీద దబదబా బాదేయడం మొదలుపెట్టాడు. సావిత్రి "అయ్యో, వదలండి, కొట్టకండి, అయ్యో" అంటూ ముందుకు పరుగెత్తి రాంపండు చుట్టూ తన చేతులుచుట్టి, తన వీపు అడ్డుపెట్టింది. కామేశ్వరరావు ఆగాడు.

“వెధవ! దుడుకుతనం హెచ్చయిపోతోంది. ఊరుకుంటే లాభంలేదు – ముందు వాడిని వదిలి నీవు రక్తం కడుక్కో” అన్నాడు. సావిత్రి రాంపండును పట్టుకొని కూర్చునే ఉంది. కామేశ్వరరావే త్వరగా ఒక సద్ది తడిపి, రక్తం తుడిచి, సల్ఫానిలమైడు పౌడ రద్దికట్టుకట్టాడు. సావిత్రిఒడిలో రాంపండు కూర్చొని ఏడుస్తున్నాడు. “ఏడు, వెధవా” అంటూ మళ్ళీ ఉరిమాడు కామేశ్వరరావు. “అయ్యో, వాడి నేమీ అనకండి,” అంటూ సావిత్రి రాంపండును మరింత దగ్గరగా దాచుకుంది. ఆమెకు భయం పెరగసాగింది: తనవల్ల రాంపండుకే దెబ్బలు తగులుతున్నాయి – వీటివల్ల వాడు తనకు మరి దూరమైపోతాడేమో, తాను చివరికి అందరి సవతి తల్లులలాగే అయిపోతానేమో నని. రాంపండు తననుంచి దూరంకాకుండా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తూ రాంపండును మరింత గట్టిగా గుండెలకు నొక్కుకుంది.

ఆరాత్రి రాంపండుకు జ్వరం వచ్చింది. ఇక సావిత్రికి గుండెల్లో గుండెలు లేవు. ఈ జ్వర మేమిచేస్తుందో! లోకమంతా తనను గురించి ఏమనుకుంటుందో! జ్వరంతో మూలుగుతున్న రాంపండును చూస్తూంటే ఆమెకు కన్నీ రాగలేదు. రాంపండుపక్కనే కూర్చుంది. రాంపండు జ్వర తీవ్రతలో, “నాన్నా, కొట్టకు, నాన్నా” అంటూ పలవరిస్తున్నాడు. ఆ పలవరింపులు విని కామేశ్వరరావు నీరైపోయి రాంపండు తలవైపు కూలబడిపోయి తలనిమురుతూ “చిట్టి నాన్నను అనవసరంగా కొట్టాను, పాపిష్టి వాడిని” అనుకుంటూ తలవంచుకు కూర్చున్నాడు. కొడుకునుగురించి భర్తమనస్సులో ఏమి బాధపడుతున్నాడో అన్న ఆందోళన బయలుదేరింది సావిత్రికి. భార్యాభర్తలిద్దరూ రాత్రంతా జాగరణ చేశారు. పొద్దున్న కామేశ్వరరావు డాక్టరును తీసుకవచ్చాడు. డాక్టరు వచ్చి చూసి “ఏమీ భయంలేదండి. మామూలు జ్వరమే. రెండు రోజుల్లో తగ్గిపోతుందిలెండి” అని చెప్పి మందులిచ్చి వెళ్ళాడు. అయినా వాళ్ళకు ధైర్యం కలగడంలేదు. ఇరుగు పొరుగువాళ్ళు కూడా కొందరు వచ్చిచూసివెళ్ళారు. కామేశ్వరరావు ఆవేళ ఆఫీసుకు సెలవుపెట్టి రాంపండుదగ్గరే కూర్చున్నాడు. భార్యను పోయి వంటింట్లో పనిచేసుకురమ్మని బలవంతంమీద పంపాడు. సావిత్రి వంటింట్లోకి పోయి పనులు చూసుకొని నీళ్ళుతోడి తెచ్చుకోవడానికి బావిదగ్గరకు వెళ్ళింది. నీళ్ళబిందె చంకలోకి ఎత్తుకుంటుండగా ప్రక్కదొడ్లో నుంచి గుసగుసలు వినిపించాయి. “ఆఁ— సవతితల్లి సవతితల్లేనమ్మా. ఆయనకు ఛాదస్తం కాని రత్నంలాంటి బిడ్డను నిక్షేపంగా అమ్మగారింట ఉంచక ఇక్కడ ఉంచడమేమిటి? ఇక్కడ ఏం సుఖపడతాడని? ఎంతఅయినా సవతి తల్లి కన్నతల్లి కాగలదా.” ఆ మాటలు విని సావిత్రి కొంచెంసేపు స్తంభించిపోయింది. ఎలాగో బరువెక్కిన గుండెతో బిందె తీసుకువచ్చి లోపల దింపింది. ఆమె కేపనీ చేయడానికి తోచలేదు. లోపల బాధా, అవమానమూ కంఠంనిండా నిండిపోతున్నాయి. ఇరుగు పొరుగులంతా అప్పుడే తనను మామూలు సవతి తల్లిలాగే భావించివేశారు. తన భర్త కూడా అలాగే భావిస్తాడా? భావిస్తే ఇక తనకేముంది? గుండెలో జడుపుతో మళ్ళీ రాంపండుదగ్గరకు వచ్చి వాడి నుదుటిమీద చేయివేసింది. జ్వరం ఇంకా తగ్గలేదు. కామేశ్వరరావు కొంతసేపుండి పెద్ద నిట్టూర్పు విడిచి అన్నాడు: “ఈ జ్వరం తగ్గిపోగానే వీడిని వాళ్ళ అమ్మమ్మగారింట దిగబెట్టివస్తాను, సావిత్రీ.” సావిత్రి గుండె ఒక క్షణం ఆగిపోయింది. అనుకున్నంతా అయింది. భర్తదృష్టిలోకూడా తను మామూలు సవతితల్లే అయిపోయింది! భర్తకేసి దీనంగా చూసింది. ఒక్కసారిగా ఆమెకు ఏడుపు పొంగివచ్చింది. రాంపండుమీదకు వాలి వెక్కివెక్కి ఏడవసాగింది. కామేశ్వరరావు ఆమె ఆవేశం చూసి విస్తుపోయాడు “ఎందుకేడుస్తావు, సావిత్రీ” అన్నాడు మెల్లగా మరేమనాలో తోచక. “మీరు కూడా నన్ననుమానిస్తున్నారా? మీ దృష్టిలో కూడా సవతి బిడ్డలపట్ల ప్రేమలేని సవతి తల్లినే అయిపోయానా” అంది రుద్ధకంఠంతో. “లేదు సావిత్రీ. నీవు వాడిమీద ఎంత ప్రేమ చూపుతున్నావో నాకు తెలియదూ. కన్నతల్లికన్నా కూడా ఎక్కువగా చూపుతున్నావు. కాని వాడిమనసుమాత్రం ఎందుకో నీమీద కుదిరినట్లు లేదు. అందుకే వాడిని అమ్మమ్మగారింటే ఉంచితే అందరికీ బాగుంటుం దనుకుంటాను,” అన్నాడు కామేశ్వరరావు. “నా రాంపండును నాదగ్గరనుంచి తీసుకువెళ్ళడానికి వీలులేదు” అంది గట్టిగా సావిత్రి రాంపండును మరింతగా కౌగిలించుకుంటూ. కామేశ్వరరావు మౌనంగా ఆమెకేసే కొంతసేపు చూశాడు. తరువాత “అలాగే సావిత్రీ, వాడిక్కడే ఉంటాడు” అన్నాడు.

రాంపండుకు జ్వరం సాయంత్రానికి తగ్గుముఖం చూపింది. మరునాటికి బాగా తగ్గింది. మూడోనాటికి మామూలుగా లేచి తిరగసాగాడు. ఇప్పుడు వాడు సావిత్రిదగ్గర ఇదివరకటికన్న చనువుగానే ఉంటున్నాడు. ఆమెను పేరుపెట్టి పిలవడం లేదు కాని, “అన్నంపెట్టు”, “బట్టలు తొడుగు” అంటున్నాడు. ఆమె చెప్పినట్లు చేస్తున్నాడు. సాయంత్రం బడికి వెళ్ళేముందు సావిత్రి కానీయో, అర్ధణో ఇస్తుంటే అది తీసుకొని వెళుతున్నాడు. కాని వాడు ఆమె

దేహ శుభ్రతకు దాదాపు

ఏ సబ్బయినా చాలును.

కాని హమాం మీకు ఎంతో
ఉత్సాహము
నిచ్చును!



మరియు ఆదాయకరము కూడ...
ప్రతి బిళ్ల ఎంతో కాలము వచ్చును!
అది మంచి సబ్బు అని మీకు నిశ్చయముగా తెలుసు. ఎందుకంటె అది టాటా తయారు.
A TATA PRODUCT
ఇండియా పెట్టుబడితో ఇండియా నిర్వాహణ క్రింద, ఇండియాలోనే తయారవుతున్నది.
టాటా స్పోర్ట్స్ రెవ్యూ ప్రతి మంగళవారము, లక్ష్మీవారము, శనివారములు రాత్రి 9 గంటలకు రేడియో సిలోన్‌లో వినండి
TS 9773

★ చిన్ని పరీక్ష ★

కేసి అదోరకంగా చూస్తూ పోతున్నాడు. ఆ చిన్ని కళ్ళలో ఆ అసంతృప్తి చూసి సావిత్రి నివ్వెరపోతోంది. ఆ అసంతృప్తి పోగొట్టడ మెలా అని బాధపడుతోంది. రాంపండు ఇదివరకటికన్న చనువైనా ఆమె ముందు ఇంతవరకు ఒక్కనాడైనా నవ్వలేదు. ఉత్సాహంతో మాట్లాడలేదు. దగ్గర ఉంటూనే దూరంగా ఉండిపోతున్నాడు. వాడి చిన్ని హృదయం అర్థం చేసుకోవడ మెలా అని సావిత్రి మనస్సును మథించుకుంటోంది.

ఒకరాత్రి భర్త అడిగాడు: "రాంపండు ఇప్పుడు నీదగ్గర బాగా చనువయ్యాడు కదూ."

"అయ్యాడం"ది సావిత్రి. కాని ఆమెకు తెలుసు తాను రాంపండు హృదయంలో కన్నతల్లి స్థానం పొందలేకపోయానని. కాని ఆ విషయం చెప్పి భర్తముందు ఓటమి అంగీకరించడానికి అభిమానం అడ్డువచ్చింది.

కామేశ్వరరావు ఆమె మనసులోని ఆందోళన గ్రహించలేకపోయాడు. రాంపండువిషయంలో ఇక తను నిశ్చింతగా ఉండవచ్చుననుకొని "నా అదృష్టం కొద్దీ నువ్వు నాకు దొరికావు, సావిత్రీ" అన్నాడు.

ఆ పొగడ్త విని పొంగిపోయే బదులు సావిత్రి సిగ్గుతో కుమిలిపోయింది. 'ఆ పొగడ్త కన్నివిధాలా తగితే ఎంత బాగుండును!' అంటూ లోలోనే నిట్టూర్చింది.

ఇన్నాళ్ళూ రాత్రిళ్లు సరిగా నిద్రలేకపోవడంవల్లా, ఇంట్లో చాకిరీవల్లా సావిత్రికి కొంచెం బడలిక చేసింది. అయినా భర్తకు తెలియనీయకుండా మామూలుగానే వంట చేసి భోజనంపెట్టి పంపించింది. తాను మాత్రం భోజనం చేయలేకపోయింది. గల నొప్పితోపోయి మంచంమీద పడుకుంది. కొంతసేపటికి రాంపండు బడినుంచి వచ్చాడు. ఇల్లంతా తిరిగాడు. సావిత్రి ఉన్న గదిలోకి తొంగిచూసి ఆమె పడుకోవడం చూశాడు. మళ్ళీ ఇల్లంతా తిరిగాడు. తిరిగి మెల్లగా సావిత్రిగదిలోకి అడుగుపెట్టి "అన్నం పెట్టవూ" అన్నాడు. సావిత్రి మెల్లగా లేచివెళ్ళి వాడికి అన్నం పెట్టి, వంటింటి తలుపు దగ్గరవేసివచ్చి మంచంమీద పడుకుంది. రాంపండు అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటున్నాడు. కాని సావిత్రి అలా మాట్లాడకుండా పడుకోవడం వల్ల వాడికేదో లోటు తోచసాగింది. చివరకు పుక్కపిల్లను చంకక్రింద పెట్టుకొని మళ్ళీ సావిత్రి గదిలోకి వచ్చి కొంతసేపు ఆమెకేసే చూస్తూ నిలబడ్డాడు. సావిత్రి వాడి రాక గమనించింది. కాని వాడు నిం[illegible] చేస్తాడో చూదామని మాట్లాడకుండా చూస్తోంది. ఉండి ఉండి వాడు మెల్లగా ప్రశ్నించాడు: "నువ్వుకూలా అమ్మలా చచ్చిపోతావుకదూ." సావిత్రి నోరు తెరచుకొని ఉండిపోయింది. ఏం జవాబీయాలో కూడా తెలియలేదు. మనస్సు ఖాళీ అయిపోయినట్లైంది. రాంపండు కొంచెంసేపు చూసి చూసి వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు. సావిత్రికి పిచ్చెత్తినట్లై అలాగే ఉండిపోయింది. కొంతసేపటికి వంటింట్లోనుంచి ఏవో డబ్బాలు పడుతున్నట్లు చప్పుడై కంగారుగా అటు పరుగెత్తింది. రాంపండు కర్రపెట్టెమీద ముక్కాలిపీట వేసుకొని, దానిమీద నిలబడి బల్లలమీదనున్న డబ్బాలు అందుకోబోతున్నాడు. కొన్ని డబ్బాలు నేలమీద దొర్లుతున్నాయి. సావిత్రి రావడంచూసి రాంపండు ఒక్క దూకు దూకి పారిపోయాడు. సావిత్రికి ఆశ్చర్యంవేసింది వాడికి ఏంకావాలో అని. పోనీ తనకు చెప్పడేం? బహుశా వాడి తల్లి వాడి కేదో అలవాటు చేసిందేమో, దానికోసం చూస్తున్నాడేమోనని తోచింది. అన్ని డబ్బాలు తెరచి చూడసాగింది. చివరకు ఒక డబ్బాలో ఎప్పటివో నాలుగు వేపుడు బియ్యం పలుకులున్నాయి మరొక డబ్బాలో అడుగున ఏదో కొంచెం నల్లగా మడ్డికట్టినట్లు కనిపించింది. సావిత్రి వాసన చూసింది. స్వల్పంగా వేరుశెనగపప్పు పాకం వాసన వేసింది. ఆమె కొంతసేపు ఆ డబ్బాలకేసే చూస్తూ నిలబడి, తిరిగి అన్నీ యథాస్థానాల్లో పెట్టివేసింది. తలకు ఒక రుమాలు గట్టిగా బిగించి చుట్టుకొని పొయ్యిలో మంటచేసింది. వేపుడు బియ్యం తయారుచేసి ఒక డబ్బాలో పోసిఉంచింది.

సాయంత్రం భర్త రాగానే ఎదురుగా పోయి "మీరు ఇప్పుడే పోయి ఒక సేరు వేరుశెనగకాయలు తెచ్చిపెట్టండి" అంది. "అలాగే తెచ్చిపెట్టానులే, ఇప్పుడేమంత అర్జంటు" అంటూ కామేశ్వరరావు లోపలికి రాబోయాడు. "కాదండీ, ఇప్పుడే కావాలి" అంది సావిత్రి కామేశ్వరరావు ఆమె తొందరకు ఆశ్చర్యపోయినా, మారు మాట్లాడక అలాగే బజారుకువెళ్ళి వేరుశెనగకాయలు కొనితెచ్చాడు. సావిత్రి వెంటనే అవి ఒలిచి, వేయించి, బెల్లం పాకంపట్టి అందులోవేసి చిన్నచిన్న ఉండలుగా చేసింది. అవికూడా ఇంకొక శుభ్రమైన డబ్బాలో ఉంచింది.

మర్నాడు ప్రొద్దున్న రాంపండు మామూలుగానే బడికి తయారయ్యాడు. సావిత్రి వాడికి [illegible] తల దువ్వి చేయి పుచ్చుకొని "ఇలారా" అంటూ లోపలికి తీసుకువెళ్లింది. జేబు పట్టుమంది. జేబు పట్టాడు. కొన్ని వేపుడు బియ్యం పోసింది. రాంపండు ఆశ్చర్యంతో సావిత్రి మొగంలోకి చూశాడు. మెల్లగా చేయి చాపాడు. వేరుశెనగపప్పు పాకం ఉండ పెట్టింది సావిత్రి. వాడి మొగం విప్పారిపోయింది. అది తింటూ ఎగురుకుంటూ వెళ్ళిపోయాడు.

బడి విడిచినతర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. అన్నం పెట్టనా అంది సావిత్రి. "ఉహుఁ. ఇవి పెట్టు" అన్నాడు జేబూ, చెయ్యీ చూపిస్తూ. సావిత్రి నవ్వుతూ "అస్తమానూ తింటే మంచిది కాదు. నాన్నా" అంది. అయినా కొద్దిగా వేపుడు బియ్యం తెచ్చి వాడిజేబులో పోసింది. ఒక వేరుశెనగపప్పు పాకం ఉండ చిదిపి వాడి చేతిలో పెట్టింది. ఉయ్యాల ఊగుతున్నట్లు ఊగుతూ, అవి తింటూ రాంపండు అడిగాడు: "నిన్నేమని పిలవనూ?" అని. "అమ్మ అని పిలు, నాన్నా" అంది సావిత్రి ఆశతో. "చలే అమ్మ. ఇవ్వాళేం మా మాష్టారేం ఆ - ల్ల పిల్లాడిని కొట్టేచారు. ఆడు ఈ - ంత పేద్దగా ఉంటాడు. ఆడు ఏడ్చేచాడు. మేం నవ్వేచాం" అంటూ తల తిప్పుకుంటూ, కాలి వ్రేళ్ళమీద లేస్తూ ఏన్నో అర్థంలేని కబుర్లన్నీ ఉత్సాహంతో ఏకరువు పెట్టేస్తున్నాడు. ఇన్నాళ్ళకు వాడు సరదాగా మాట్లాడడం విండి సావిత్రి. ఆనందం పట్టలేకపోతోంది. వాడిని చనువు చేసుకుందుకు ఇంత చిన్న కిటుకుందని ఇన్నాళ్లూ తెలుసుకోలేక పోయాననుకుంది. వాడిమీద ఏదో తన ప్రేమంతా ఒక్కసారి ఒలకబోసి ఉక్కిరి బిక్కిరి చేయబోయింది. వాడి చిన్న పరీక్షు నెగ్గడానికి తా నిన్నాళ్లూ పడ్డపాట్లన్నీ జ్ఞాపకం వచ్చాయి రాంపండు మాటలూ చేష్టలూ చూస్తుంటే తను పడ్డ పాట్లు తలచుకుంటూంటే ఒక్కసారిగా ఆమెకు ఎందుకో నవ్వు పొంగి వచ్చింది. పకాలున నవ్వేసింది. ఆ నవ్వు ఆపుకోలేక పోతోంది. రాంపండు ఒక క్షణం తెల్లబోయి, మళ్ళీ ఆమె నవ్వుచూసి తానూ నవ్వడం మొదలుపెట్టాడు. వాడి నవ్వు చూసి సావిత్రి నవ్వు మరీ ఎక్కువైంది. సావిత్రి నవ్వుచూసి రాంపండు నవ్వూ ఎక్కువైంది.

నవ్వి నవ్వి సావిత్రి చటుక్కున వాడిని ఎత్తుకొని గుండెలకు అదుముకుంటూ వాడి మొగం, బుగ్గలూ, పెదవులూ అంతటా ముద్దులమీద ముద్దులు కురిపించసాగింది. వాడి బుగ్గలు కొరికేసినంత పనిచేసింది. కాని రాంపండు తిరిగి కరవలేదు సరిగదా ఇదేదో బలే తమాషా ఆట అనుకుంటూ "గుల్లాం, గుల్లాం" అంటూ ఆమె చేతుల్లో [illegible]